# నీలి గంధాలు

శ్రీ తెన్నేటి సూరి

జాములు కమాన్లు కదులుతున్నయ్
మధువసంత యామినీ
మంగళ నిశ్శబ్దగీతి
పిలచినది!
హృదయమునే
కలచినదీ!.. ॥మధు॥
ముదితమౌన శార్వరీ
మోహనిగూఢ స్రవంతి
మొరసినదీ!
తెలివెన్నెల
విరిసినదీ!.... ॥మధు॥

"ఈ రాగం పేరేమిటి బావా?"

"పటదీప్"

"అరె! ఎంతందంగా వుందీ!"

"అందం రాగాందికాదు"

"ఆఁ?"

"శ్రుతి"

"ఏమోనబ్బా! నువ్వేదో అంటావు గాని.... మన రాగాల్లో ఏదీ ఇంత అందముగా వుండదు. శ్రుతేమిటి?.... హిందుస్థానీ రాగాలకు ఆ చక్కదనంవుంది."

"శ్రమ మన రాగాలకున్న జీవకళ వీటికెక్కడేడిసింది. శాస్త్ర శ్రుతి సుఖం చూసుకు పాడితే, సౌందర్యంలో మన రాగాలముందు ఇవి నిల్చోలేవు.... నువ్వెంతో అదృష్టవంతురాలివి"

"అదృష్టమేమిటి?"

"కర్ణాటకం కట్టుగా చెప్పుకున్నావు. కావలసినంత గ్రంథం సంపాయించుకున్నావు. మా నాన్నగారి దగ్గిరుంటే, నేనూ కర్ణాటకం బాగా చెప్పుకునేవాణ్ణి. ఈ ఇంగ్లీషు చదువు మూలంగా నాకా అవకాశం లేకుండా పోయింది"

"ఏమోనబ్బా! నువ్వు హిందుస్థానీ బాణీగా పాడుతుంటేనే నాకు ప్రాణం హాయిగా ఉంటుంది.... అలా పాడ్డం నాచాతొతేనా!.. ఏదోతమాషాకి అంటున్నావుగాని ఖచ్చిత శ్రుతి సుఖం చూసుకు పాడితే కట్టుకు, మన రాగాలిలా వుంటాయా?"

"నీకు తెలియదులే"

"ఏదీ! అయినా, మనరాగం ఒకటి తీసి, అలా పాడి చూపించుదూ. చూద్దాం"

"నీకు నీలాంబరి వచ్చా?"

"'శృంగారలహరి' వచ్చుగా!"

"ఏదీ పాడు"

"శృం, ఉం, ఉం, గఅ, అఅఅ, రఅఅ, లాహారే." అంటూ మెట్లు మెట్లుగా పాడుతుంది.

"అలాకాదు నే నంటానుచూడు"

"ఏది అను"

"శృం...."

"అరె! అదేమిటి! అలా పడగ విప్పుకు నిల్చుంటోందేమిటి ఆ రాగం?"

"అదే మరి."

"చాలా బావుంది బావా! నాకొచ్చిన కీర్తనలన్నీ ఇలా మార్చి చెప్పుకుంటే?"

"చక్కగా వుంటయ్ .... కష్టపడి సంగీతం చెప్పుకొన్నందుకు జీవితంలో సుఖం, సంతోషం లభిస్తాయి."

"ఇక్కడ నీ దగ్గిరుండి చెప్పు కొంటాను బావా! నన్నిక్కడ ఉంచి బొమ్మని మా నాన్ననడుగు. నేనుంటా నంటే ఉణ్ణీరు .... పోనీ అత్తయ్యచేత చెప్పించు."

"చిన్నదానివి మీ అమ్మను వదలి పెట్టి ఇప్పుడప్పుడే వుండలేవు ... నేను మీ వూరొస్తాగా!

"ఎప్పుడూ!"

"కాలేజీ తెరవంగానే.... ఇంటర్‌లో జేరాలిగా"

"అరె! బలే! ఇంకేం! ఈ కీర్తన లన్నీ చక్కగా మరాటీ బాణీలోకి మార్చేసి నీ చేత చెప్పించేసుకోవచ్చు."

"మరి నాకూ నువ్వు చెప్పాలిసొస్తుంది"

"నేనేం చెప్పాలీ?"

"నీ కొచ్చిన కృతులన్నీ"

"అలాగే చెబుతాను ఓష్! దీనికేనా మనిద్దరం కలిసి హాయిగా పాడు "కుందాం"

"నాకు వీణ చెప్పుకోవలని ఆశగా వుంది. అక్కడ మీ వూళ్ళో మంచి విద్వాంసులున్నారటగా. మా నాన్న గారన్నారు?

"నేను చెప్పుకుంటున్నాగా"

"అదృష్టం"

"అదృష్ట మేమిటి? .... నువ్వూ చెప్పుకుందువుగాని."

"మ్చ! ఈ జన్మలో నాకా ఆశ తీరదు."

"ఏం?"

"వీణ సాధకం చెయ్యాలంటే, బాగా విశ్రాంతి వుండాలి. నాకు నైతేమేదీ?"

"ఏం?"

"ఈ చదువో?"

"మానెయ్యరాదూ?"

"నేను చదువు మానటం .... మా సుబ్బలక్ష్మికి ఇష్టంలేదు."

"సుబ్బలక్ష్మంటే నీకు పాలిచ్చి నమ్మాయా?"

"ఆఁ"

"సుబ్బలక్ష్మికి ఇష్టం లేకపోతే మాత్రం నువ్వెందుకు మానగూడదూ?"

"లక్ష్మికి కోపం వస్తుంది."

"వస్తే!"

"నాకు బాగుండదు"

"మరే! బావోయ్! మీ సుబ్బలక్ష్మి నన్ను ఇందాక కోమటింటికి తీసుకెళ్ళి పిప్పరుమెంటు బిళ్ళలు కొనిపెట్టింది బావా.... నన్ను ఎత్తుకునీ, బుగ్గలు ముద్దు పెట్టుకుంది"

"చిన్నప్పుడు నన్నూ అలానే ముద్దు బెట్టుకునేది"

"ఇంకా బలేబలే తమాషా మాటలు చెప్పింది బావా! నీకు బూరెలు వండటము చాతౌనా అంది చేతగాదన్నాను. నేర్చుకోమంది."

"నాకు బూరెలంటే ఇష్టం."

"నువ్వు చాలా మంచివాడవన్నాను. కోప మొచ్చినప్పుడు చూడమంది—చక్కగా పాడతావన్నాను. బాగాపాటలు వ్రాస్తావంది. మంచి పాటగాడి వౌతా వన్నాను. కాదు, బాగా చదువుకుని పెద్ద కవి అవుతావన్నది. అల్లావీల్లేదు:

సంగీతమే పాడతాడని దెబ్బలాడాను. కోపంగా నా వంక చూసి, నీకు తెలియదులే, చిన్నపిల్లవ్ అంది. మీ లక్ష్మి బలే, తమాషా మనిషి బావా!"

"వట్టినే కబుర్లు చెబుతున్నావ్.... మళ్ళీ బండికి వెడుతావ్... ఇంకో కీర్తన పాడూ"

"అమ్మదొంగా! నా చేత తెగ పాడిస్తున్నావ్... . నేను పాణ్ణు. నువ్వు పాడాలసిందే"

"ఏం పాడమన్నావ్"

"'నీలిగంటలే విచ్చినవా' అన్న పాట నాకింకా బాగా రాలేదు. అదిమళ్లా ఓసారి చెప్పు. ఆపాట నాకెంతో ముచ్చటగా వుంది."

"నిజంగానా?"

"నిజం, నిజం. ... ఒట్టు....నీ మీద ఒట్టు."

"అలాగైతే యీ తడవ యింకా బాగా వ్రాస్తాను."

"ఆ పాట ఇంకోసారి చెప్పుబావా!"

ఇద్దరూ కమాన్లు తీసుకున్నారు—

జంత్రి గాత్రాలు సెలయేళ్ళలా ప్రవహించు తున్నయ్—

* నీలిగంటలే విచ్చినవీ!
నిశ్శబ్దములే మ్రోగినవి—
ఘణుఘణు, ఘణుఘణు
మణినాదములై .... ॥నీలి॥
కన్నె హృదయమే విచ్చినదీ!
బంగరు గాజులె పలికినవీ— ॥నీలి॥
ఆకుల మాటున విచ్చినవీ
అరవిందములే మ్రోగినవీ— ॥నీలి॥
ఘల్ ఘల్, ఘల్ ఘల్
తలుపుచాటుగా,
కలరావముగా,
బంగరుగాజులె పలికినవీ
ప్రణయగీతమే మొరసినదీ— ॥నీలి॥

వదినే మరదళ్ళిద్దరూ అదే అదే వచ్చీను ఆపేసి ఒకళ్ళ ముఖంలోకి ఒకళ్ళు చూసుకుని ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. పాటవింటూ కూర్చున్నారు.

పాటవిని, కచేరీ సావిట్లోనుంచి బావమరదు లిద్దరూ నడవాలోకివచ్చారు. ఒకరి భుజాన ఒకరిచెయ్యివేసి ఒకర్నొకరు అనుకు నుంచున్నారు

సుబ్బలక్ష్మి నెమ్మదిగావచ్చి గది మొత్తకు అనుకు నుంచుని పాట వింటోంది.

"నీలిగంటలే విచ్చినవీ
నిశ్శబ్దములే మ్రోగినవీ"

హృదయాలు రెండూ విచ్చిలుకుని, ప్రపంచాన్ని మరిచేసి గొంతులెత్తి బిగ్గరిగా పాడుతున్నారు

"పిల్లలికి పెళ్ళిదువచ్చింది" అన్నది వదినె

"అపును ఆనాలుగు అక్షింతలూ వేసేస్తే అచ్చటా ముచ్చటా చూసుకోవచ్చు" అంది మరదలు.

"కన్నె హృదయమే పిలిచినదీ...." అంటూ మూల్చిన స్థానాన్ని అందుకున్నాడు - ఓరకంట ఆ కన్నెపడుచు ముఖంలోకి చిరునవ్వుగా తొంగిచూస్తూ.

సిగ్గుమొగ్గయి, కమానక్కడ పారేసి

* 'నీలిగంటలు'—ఒక పూదీగ.

జడకుప్పెలు చేత్తో పట్టుకుని, తుర్రున గదిలోకి పారిపోయి తలుపుచాటున దాక్కుంది.

"పసిపిల్లల ముందు పెళ్ళి సంగతు లెందుకెత్తుతారమ్మా? ఇప్పణ్ణుంచీ గుండెలు చీరుకోటానికి?" అంటూ, లక్ష్మి దొడ్లోకి నడుస్తోంది.

* * *

ఈ దృశ్యమంతా అతని మెదళ్లో గిర్రున మళ్లా ఫిలుంలా తిరిగిపోయింది. డొక్కలో గడ్డపలుగుదిగేసినట్టు నొప్పి పుట్టుకొచ్చింది. బాధగా మూలిగాడు. ఒత్తిగిలి కళ్ళు అరమూతలు వేసుకుని పడుకున్నాడు.

కప్పు, సాసరూ తీసుకుని తల్లి గదిలోకి వచ్చింది. అక్కడ బల్లమీద వాటినివుంచి వచ్చి పక్కలోకూర్చుంది. కొడుకు వంటిని తాకిచూసింది.

"ఈ పూట జ్వరం మరీ హెచ్చుగా తగిల్నట్టుంది"

అతను మాట్లాడలేదు.

"కాస్త వేడివేడి కాఫీ పుచ్చుకో నాయనా! కొంచెం త్రాణగావుంటుంది"

"త్రాగాలని లేదమ్మా!—"

"కొంచెం."

"అబ్బా!" అంటూ చిరాల్పడి విసుక్కున్నాడు

అవును, ఆ ఇంట్లో తన్ను అంతా విసుక్కుంటున్నారు. ఆ యింట్లో ఇక తనమాట లెక్కజేసేవా రెవరూ లేరు. ఇంతవరకూ తనా యింటికి యజమాని ననుకుంది. అందరూ తన మాటంటే ఎంతో గౌరవించేవారు. ఇప్పుడు తను అంటే ఒక గడ్డిపోచకంటే కనీసంగా చూస్తున్నారు. "పిల్లడి సంగతేమీ బాగా లే"దనిఆదుర్దాగా భర్తతో చెప్పబోతే 'చూసుకుంటున్నాంగా' అంటూ ఆపిల్లడి బాధ్యత తనకేమీ లేదన్నట్టు మాట్లాడు తున్నాడు భర్త.

"ఆ పాడు సంబంధం మాట పిల్లడి ముందు పేలవద్దని లక్షసార్లు చెప్పాను" అంటూ అత్తగారు ఆపిల్లడి దుస్థితికంతకు బాధ్యురాలు తనే అయినట్టు తన నెత్తికి ఆముళ్ళకిరీటం తొడుగుతోంది. "గంపెడాశలు మూటగట్టుకుని బిడ్డకు పాలిచ్చి పెంచుకున్నాను; చివరకు ఈ యమ్మ చుట్టరికానికి బలిపెట్టాను" అన్నట్లు బిడ్డ వంక దిగులుగా చూసి నిట్టూరుస్తోంది లక్ష్మి.

అసలా పిల్లణ్ణి పలకరించటానికే వీల్లేదు. "నీవే నాడొక్క యిలా చీరింది" అన్నట్టు తనవంక బాధగా చూస్తాడు. తన అసమర్ధతనంతా, తన లేకితనాన్నంతా భరించుతున్న సహన మూర్తిలా "అక్కర్లేదులే" అంటూ తను ఏ చిన్న సహాయం చేయబోయినా నిర్లక్ష్యం చేస్తాడు "ఇంత భరించు తున్నా, నాణ్ణీ యీ కాస్త సహాయం నువ్వు చెయ్యకపోతే నేను చావనులే." అన్నట్టు కోపంగా విరునవ్వు నవ్వుతాడు.

"పిల్లడిసంగతి ఎలావుంది?" అని డాక్టరును ఆదుర్దాగా అడిగితే మందు మాకుల వల్ల ప్రయోజనమున్నట్టు తోచదు అతను ఏదో మనస్సులో చాలా బాధపడుతున్నాడు. మనశ్శాంతి చేకూర్చుకుని తనకి తనే ఎల్లాగో అలా పైకి లేవాలి" అంటున్నాడు.

ఆ అఘాతంలో అతణ్ణి తనే త్రోసింది. అతనంతటి కతను లేవటం ఆ పసివాడివల్ల నేమౌతుంది? తను చెయ్యూసరా యిచ్చి పైకి తెచ్చుకోగలిగితే?— సరే! తన కాయోగ్యతేవుంటే తనకీ దుర్గతంతా ఎందుకూ? పురుగును చూసినట్టు లోకం తన్నలా ఎందుకు చూస్తుంది?

ముంచుకొస్తున్న ఏడుపు ఆపుకోటానికి పైటచెంగు ముద్దగా చుట్టి నోట్లో కుక్కుకుంది. ఆ బంగారుముఖం కళవళంగా కదిలి చెలించిపోతూ వుంది.

"అబ్బా! ఎందుకమ్మా యేడుస్తావూ?"

"నన్నేం చెయ్యమన్నావూ?"— వెక్కి వెక్కి యేడుస్తుంది.

"నిన్నేం చెయ్యమన్నా నమ్మా యిప్పుడూ?"

"వాళ్లు నామాటవినరు—"

"ఎవళ్లూ?"

"నావాళ్లు."

"వాళ్లు వినకపోతే నీకేం తక్కువా? మేమంతా వింటున్నాంగా, వాళ్ళసంగతి ఎందుకు?"

"మీరు మాత్రం యెవరు వింటున్నారూ?"

"అదేమిటమ్మా! ఎందుకలా అనుకుంటావూ?" అంటూ, నెమ్మదిగా పక్కలో లేచి కూర్చున్నాడు. తల్లి వీపు మీద ఆప్యాయంగా ఆనుకున్నాడు. "అనవసరంగా బాధపడుతున్నావు నీ మాట వినందెవరు? నాన్న వినరా?— నీబిడ్డలు వినరా?—ఎందుకలా అనుకుంటావు?"

"ఎందుకు వింటారూ? కన్నబిడ్డలకే దూరమై పోతున్నాను. నీకిన్ని పాల చుక్కలన్నా ఇచ్చి పెంచుకోలేక పోయాను. పోనీ పేగును పేగుబెట్టి ముడేసుకుందామనుకున్నాను. ఇదంతా ఇలాఅయింది"

"నువ్వు అనవసరంగా విచారపడుతున్నావు నేను నీమాట వినకపోవటమేమిటి? నీ పాదాలదగ్గిరనుంచి నేనెప్పుడూ అవతలికి పోను. నాకు పాలిచ్చి పెంచుకోలేకపోయావని నీకు లోపల గంపెడు బాధవుందని నాకు తెలుసు. అందుకనే నీ బాంధవ్యంతో నాచుట్టూ పెనవేసుకుపోవాలని ఆదుర్దా పడుతున్నావనీ నాకు తెలుసు. యిది అర్థం చేసుకునే, తూగి అడుగు ముందుకువేసి ఈ ఊబిలో దిగబడిపోయాను. కాని.... తల్లిమాటను నిర్లక్ష్యం చేసే నీచుడెవడూ ఈ వంశంలో ఇంకా పుట్టలేదు. అందులో ప్రథముణ్ణి కావటం నా కిష్టంలేదు జీవితంలో మరో ఇతర లక్ష్యమేమీ లేకుండా నీ ఆజ్ఞలను పరిపాలించుతూ వుంటానికే నేను భీష్మదేవుణ్ని అనుకరించబోతున్నాను"

"అమ్మయ్యా! ఇదీ నా మూలంగానే?" అంటూ కెవ్వున యేడ్చి పక్కమీద పడిపోయింది

అతను హడలిపోయాడు. లక్ష్మీ అంటూ తల పగిలిపోయేట్టు బిగ్గరగా అరిచాడు అంతా గదిలోకి వచ్చేశారు, "ఏమిటేమి" టంటూ

"అమ్మ విరుచుకు పడిపోయింది"

"అవతలికి తీసుకుపోయి ఇన్నినీళ్ళు మొహానకొట్టి తగులెయ్యండి. పిల్లాణ్ణి కూడ బ్రతకనిచ్చేలా లేదు. ఈకులనాప..

అంటూ కోపంగా విసుక్కున్నాడు తండ్రి.

* * *

రాత్రి $8\frac{1}{2}$ గంటలయింది. అంతా లోపల భోజనాలు చేస్తున్నారు సుబ్బలక్ష్మి అతని పక్కలో కూర్చుని కాళ్ళుపిసుకుతోంది. అతను మాగన్నుగా నిద్రపోతున్నాడు.

"లక్ష్మీ" అంటూ తమ్ముడు గదిలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు

"అరవబోకు అన్నయ్యకు కొంచెం నిద్దరబడుతున్నట్టుగా వుంది"

"లక్ష్మీ! శాస్త్రుం చెప్పవ్?"

"చెబుతాగా! అరవకుండా కుర్చీలో కూర్చుని నెమ్మది. 'ఊ' కొట్టు"

"అనగనగా ఒకవూరు. ఆ వూళ్ళో ఒక పేరాశ పెద్దమ్మ. ఆ వూరికి ఒక కరణం. కరణంగారింట్లో పేరాశ పెద్దమ్మ పనిజేస్తూ వుండేది. వాళ్లు బొక్కెడు మెతుకులెడితే తిని బ్రతుకుతో వుండేది. ఆ కరణంగారికి లేక లేక ఒక కొడుకు బుట్టాడు. లేక లేక పుట్టాడేమో అంతా అల్లారు ముద్దుగా చూసేవాళ్ళు. కాని ఓ పని జరిగింది. ఆ పిల్లణ్ణి కడుపుతో వున్నప్పుడు తల్లికి జబ్బుచేసింది. అంచేత నీళ్ళుడాక తల్లి దగ్గర పాల్లేకండా పోయాయి అప్పుడు ఆ పిల్లణ్ణి పేరాశ పెద్దమ్మకు వప్ప జెప్పారు. ఆ పిచ్చిముండ పిల్లడికి పాలిస్తూ వుండేది. ఆ పిల్లడంటే ఎంతో ప్రాణంగా వుండేది."

"బలే మంచి తల్లన్నమాట!"

"ఆ పిచ్చిముండా...."

"అంత మంచి తల్లిని పిచ్చిముండంటావేం?....'ఆ తల్లి' అను"

"సరే ఆ తల్లీ....ఆ పిల్లణ్ణి ఒళ్ళో పడుకోబెట్టుకొని పాలిస్తూ ఇలా అనుకునేది.

"ఏమనుకునేది?"

"ఆబిడ్డ తన పాలుత్రాగి చాలా పెద్దవాడు గావాలనుకునేది."

"నాన్నంతవాడు గావాలనుకునేదా?"

"అంతకంటె ఇంకా పెద్దవాడు గావాలనుకునేది, పెద్దవాడై బాగా చదువుకుంటాడనుకునేది. బాగా చదువుకుని ఒక పెద్ద కవి గావాలనుకునేది."

"కవంటే?"

"గొప్పగొప్ప పాటలూ, పద్యాలూ వ్రాయాలనుకునేది."

"అంటే, సుమతీ శతకం వ్రాయాలనుకుందన్నమాట."

"అంతకంటె మంచి మంచి పుస్తకాలు వ్రాయాలనుకుంది.

"అతనట్టా పెద్దపెద్ద పుస్తకాలువ్రాసే కవి గావాలని, యెందుకో ఆ తల్లికా ఆశ?"

"అడ్డుప్రశ్నలు వెయ్యకుండా వుంటే అన్నీ నేనే చెబుతాను. ఎందుకంటే— ఆ దేశాన్ని పరాయి రాజొకడు ఆక్రమించి పాలించుతున్నాడు. ఆ రాజు మహా చెడ్డవాడు. వట్టి అబద్ధాలకోరు. తంపుల మారి. తంపులుబెట్టి ఆ దేశంలో వున్న ప్రజల్లో అన్ని తగూలు లేవదీశాడు"

"ఎందుకూ అలా చెయ్యటం?"

"ఎందుకా? .... వాళ్ళంతా కలిసి తన్ను తరిమెయ్యరూ మరీ?"

"ఓరి ముండా కొడుకూ! అదా ఎత్తూ?"

"హిందువులనీ, తురకలనీ, డబ్బున్న వాళ్ళనీ, డబ్బులేని వాళ్ళనీ, కులాలనీ, మతాలనీ — ఇలా చిలిపి తగూలెన్నో లేవదీసి ఒకళ్ళపీక లొకళ్ళు కోసేసుకునే దాకా తెచ్చాడు తనుశరించి హాయిగా చలనం లేకుండా, సింహాసనం మీద కూర్చున్నాడు; వీళ్ళల్లో వీళ్లు కొట్టుకు చస్తుంటే దేశంలో వున్న డబ్బూ, ధాన్యం అంతా తనదేశానికి జారేస్తున్నాడు. ఇక ఆదేశంలో తినతిండీ, కట్ట గుడ్డా లేక జనం దరిద్రంతో అల్లాడి చస్తున్నారు.

"ఆరాజుని కుర్చీకింద దూరి ఎత్తి పడేస్తే."

"ఎత్తి పడెయ్యటానికి వాడేమన్నా కాస్తా కూస్తా మనిషి అనుకున్నావా యేమిటి?—పైగా వాడిచుట్టూ కత్తులూ తుపాకులూ ఇచ్చి ఎంతమంది పోలీసుల్ని కాపలా బెట్టుకున్నాడూ!"

"పదిమందీ గలిసి మీదబడిపోతే, పోలీసులుమాత్రం యేం జెయ్యగలరు లక్ష్మీ?"

"పదిమందీ కలిస్తేనా?"

"అరే!....ఎందుక్కలవరూ?"

"కలవాలని వాళ్ళకు తెలియదు; అజ్ఞానం—"

"అసలు పిరికిముండా వాళ్ళేమోలక్ష్మీ! తుపాకులంటే వాళ్ళకి భయమేఁవో?"

"తెలియని అజ్ఞానులికి భయం మాత్రం వుండదూ?"

"నిజంగా వాళ్ళంతా పిరికిముండా కొడుకులే లక్ష్మీ! అల్లాంటి పిరికిపందలు మనదేశంలో పుట్టరని నా పుస్తకంలో ఉంది. బాలచంద్రుడి కథలో వుంది"

"హూ!—" అని నిట్టూర్చిందిలక్ష్మి.

"పోనీ— లక్ష్మీ! అంతాకలిసి కట్టుగా వుండాలనీ, అంతా ఒక్కసారిగా ఆరాజుమీద పడిపోవాలనీ వాళ్ళకు చెబితే"

"చెబితే వాళ్ళువినరు"

"అరె! మరెలా?"

"ఒకమహాకవి ఎవడన్నా ఆజాతిలో పుట్టి ఆమాట చెపితే అప్పుడు వింటారు. అందాకా ఆజాతికి మోక్షం లేదు"

"అందుకేనా యేమిటి పేరాశ పెద్దమ్మ ఆపిల్లడికి పాలిస్తూ మహాకవి గావాలని ఆశపడ్డదన్నావూ?"

"ఆ!"

"చివరికి ఆపాపాయి మరి అంత వాడు అయాడా మరి?"

"మ్చ్" అని పెదవి విరిచింది.

"ఛీ! ఛీ! వెధవ! ఎందుకయ్యాడు గాదు! నేనైతేనా?"

పక్కలోవున్న రోగి "లక్ష్మీ" అంటూ కళవళంగా పిలిచాడు. "దాహమేస్తోంది" అన్నాడు.

లక్ష్మి వినిపించుకోలేదు.

"అన్నయ్యకి దాహమేస్తోందిట లక్ష్మీ!"

"తరవాత తెచ్చిస్తాలే ...ముందు కథవిను. ఆపిల్లడు దినదినం పెరిగి పెద్ద వాడౌతున్నాడు. చక్కగా చదువుకుంటున్నాడు. అంతా చాలా [illegible]డు. చక్కగా సంగీతం [illegible] వాడు. [illegible]దిగా పాటలూ, [illegible]లూ కూడా వ్రాసే

Acc. No.

టము మొదలుపెట్టాడు - అనుకున్నట్టే. అవి చాలా బాగున్నాయని అంతా మెచ్చుకునేవాళ్ళు. పేరాశపెద్దమ్మ మరీ మురుసుకునేది.

"ఇంకేం....ఆ తల్లి అనుకున్నట్టే జరిగిందీ!"

"అదే జరగలేదు. అట్టా జరిగితే ఇంకేం?....మధ్య ఒక అవాంతరం వచ్చిపడి అంతా - తలక్రిందైంది. కొంసకంటూ వినూ?"

"అరె! ఏం జరిగిందేమిటి?"

"ఆ పిల్లడికి ఒక మేనమామ వున్నాడు. ఆ మేనమామకి ఒక కూతురుంది. ఆ పిల్ల కొంచెం అందంగా వుంటుంది ఆ పిల్లకూడా బాగా పాడుతుంది. ఆ పిల్లని, ఓసారి మేనత్తగారి యింటికి ఎందుకో తీసుకొచ్చారు.

"ఈ పిల్లడూనూ ఆపిల్లానూ ఇద్దరూ కమాన్లుతీసుకునిఫిడేళ్లువాయించుతూ ఒక పాట పాడుకుంటున్నారు చుట్టూవున్న ఉలిపినోళ్ళవాళ్ళు విని ఊరుకోవచ్చునా? ఈ పిల్లలిద్దరికీ పెళ్ళిచేస్తే బాగుంటుంటన్నారు. వెంటనే ఆ పిల్లకు, సిగ్గొచ్చి కమానక్కడపారేసి, గదిలోకిపారిపోయిదాక్కుంది. అప్పట్నుంచీ ఆ పిల్లనే పెళ్ళిచేసుకోవాలని ఈ పిల్లడి మనసులో పుట్టింది. ప్రపంచమంతా మరిచేసి ఆ పిల్లమీద పంచప్రాణాలూ పెట్టుకుని బ్రతకటం మొదలు బెట్టాడు అంతా కూడా ఈపిల్లలిద్దరికీ పెళ్ళౌతుందనే అనుకునే వాళ్ళు. కాని చివరికి అల్లా జరగలేదు."

"ఎందుకు జరగలేదు?"

"ఆ పిల్ల తండ్రీ తల్లీ డబ్బు చూసుకున్నారుగాని చుట్టరికం చూళ్ళేదు. డబ్బుసంగతే ఆలోచించారు గాని, పిల్లలు బ్రతికి వున్నంతకాలం గుండెలు చీరుకు చస్తారని వాళ్ళు ఆలోచించలేదు. ఆ పిల్లకి బాగాడబ్బున్న ఇంకోసంబంధం వచ్చేటప్పటికి ఈ సంబంధం వొదులుకోవాలని ఆలోచించారు."

"అదేమిటి లక్ష్మి! తప్పుగాదూ?"

"ఏం?"

"డబ్బుకోసం మొగుడూ పెళ్ళాన్ని అట్టా చీలదీయొచ్చా తప్పుగాదూ?"

"పెళ్ళిగాందే మొగుడూ పెళ్ళాం ఎట్టా అవుతారూ."

"అవుతారు లక్ష్మి, నీకు తెలవదు. నువ్వు చదువుకోలేదు గనక, నీకు తెలవదు. దమయంతీ, నలుడూ పెళ్ళిగాకుండానే మొగుడు పెళ్ళామూ అయ్యారు. సావిత్రీ, సత్యవంతుడూ కూడా అలానే అయ్యారు. నాపుస్తకంలో ఆ కథలు రెండూ వున్నయ్. కావలిస్తే తెచ్చి చూపిస్తాను—పందెం."

"వాళ్ళసంగతి వేరూ, మనసంగతి వేరు మనవాళ్ళకు డబ్బున్నవాడు గావాలిగా"

"నీకేమీ తెలవదు లక్ష్మి! ఇట్టాగే సావిత్రి తల్లీ దండ్రీ, సావిత్రిని డబ్బువున్నవాడి కిచ్చిచేస్తామంటే ఎలా చెప్పుచ్చుకు కొట్టిందో తెలుసా"

"నన్ను కథ చెప్పనిస్తావా? మానెయ్యమంటావా? మధ్య మధ్య ఇలా అడ్డుప్రశ్నలు వేస్తే కథ సాగేదెలా?"

"ఊఁ ఊఁ! చెప్పు చెప్పు."

"ఇహాఁ .... ఆ పిల్ల దేంజేశాదో తెలుసా ?....పాటా పోయింది, పద్యం పోయింది; దేశమూలేదు, ప్రజలూలేదు ఆపిల్లకోసం మనాదిబడి మంచమెక్కాడు. అన్నం. నీళ్లూ మానేశాడు. జబ్బు పుట్టింది. ప్రాణంమీదికూ్కా తెచ్చు కుంటున్నాడు."

"అరె ! పాపం !"

"ఛీ ? పాప మేమిటి పుణ్యం. అదే మంత పంచి ఎనీ ? ఆ వ్రేలెడు పిల్లనీ తనకిచ్చి పెళ్ళి చెయ్యలేదని, ఎవరన్నా అట్టా, అనవసరంగా ప్రాణం తీసేసు కుంటారా ?—తెలివి తక్కువా మరే మన్నానా"

"తెలివి తక్కువవాడుకాదు లక్ష్మీ, అట్టాగే జరుగుతుంది. మజ్నూ అల్లానే చేశాడు—మజ్నూ తెలివి తక్కువ వాడంటావా ?"

"మజ్నూ యెవరూ ?"

"అరె ! నీకు 'లైలామజ్నూ' కథ రాదన్నమాట ?"

"ఆ కథ సంగతి అలావుంచు. పేరాశపెద్దమ్మ సంగతి కాస్త ఆలో చించు. అముండ ఎన్ని ఆశలు బెట్టుకు తన్ని పెంచుకుంది ? తను ఒక మహా కవై యీ బీదవాళ్ళందరికీ అండగా నిలబడతాడనుకుందే. యీ జాతిని ఉద్ధ రిస్తాడనుకుందే. కూడూ గుడ్డా లేక అజ్ఞానంలో అలమటించి చస్తూ, ఒకళ్ళ పీక లొకళ్ళు కోసేసుకుంటున్న తన ప్రజల గతి ఇక అంతేనా ? వాళ్ళంతా అట్టా నశించిపోవాలిసిందేనా ? వ్రేలెడు ఆడపిల్లకోసం తన దేశాన్నీ, తన ప్రజల్నీ గంగలో కలుపుకుని, తనూ పీక కోసు కుని నాశనమై పోతాడన్నమాట !"—

"నిజమే లక్ష్మీ ! తెలివితక్కువ వాడులానే వున్నాడు."

"తెలివితక్కువేకాదు ! వట్టి పిరికి పంద "

"నిజమే లక్ష్మీ ! నువ్వన్నదినిజం. పిరికిపందే."

"దేశం అలావున్నపుడు చావట మేమిటి ?—అంత చావదలిస్తే దేశం బాగుపడ్డ తరువాత చావాలిగాని, ఈలోగా చావగూడదు ఛీ ! ఛీ ! వాడు వట్టి పిరికి పందే లక్ష్మీ ! నేనైతేనా ?"

పక్కలో రోగి బాధగా నిట్టూర్చాడు. "పిల్లణ్ణి లోపలికి పంపించు లక్ష్మీ ! నేను నీతో మాట్టాడుకోవాలి...."

"అమ్మావాళ్ళూ భోంచేసి సావిట్లోకి వచ్చారు. నువ్వు ఇక వెళ్ళపడుకో నాన్నా !" అని తమ్ముణ్ణి లక్ష్మి లోప లికి పంపించింది.

పక్కలో వున్న రోగి కొంచెం మోచేతిమీద లేచాడు.

"నేను బ్రతికివుంటానికి ప్రయత్నిం చుతాను లక్ష్మీ నీ దేశంకోసం, నీ ప్రజలకోసం నేను బ్రతికివుంటాను." దుఃఖం ముంచుకొచ్చి అకంఠం రుద్ధమై పోయింది.

చిక్కి శల్యమైపోయిన రోగిని హృదయంలోకి పొదువుకుని, కన్నీటితో అతని చెక్కిళ్లు తడిపింది లక్ష్మి.

"మరి పెళ్ళిచేసుకోమని మాత్రం పట్టుబట్టకు"

"నా తండ్రివి. తెలివిగలవాడివి; అర్థం చేసుకోగలవ్; ఒక్కముక్కలో చెప్పి నీచేత ఔననిపించుకోగలను."

"చెప్పు లక్ష్మీ!"

"పెళ్ళి మానటానికి వీల్లేదు"

"అసంభవం లక్ష్మీ! అదిమాత్రం నేను వినను"

"ఆపిల్లకు నువ్వు భర్తవౌతావని చెప్పేశారు"—

"అబ్బా! ఆ బిడ్డనుకూడా గొంతు కోశేశారూ?"—అంటూ బాధగా తల బట్టుకున్నాడు.

•

"కొయ్యటమో, బ్రతికించడమో అది నీచేతిలోవుంది ఇప్పుడు"

"అతడు కళ్ళుమూసుకుని మౌనమూర్తిగా ఆలోచనలో గడ్డగట్టిపోయాడు

ఒక్కక్షణానికి నెమ్మదిగా కళ్ళువిప్పి "సరే! పెళ్ళి కొడుకుని చెయ్యి లక్ష్మీ! ఎల్లుండి లగ్నానికే తూగగలమని నాన్నచేత టెలిగ్రాం ఇప్పించు."

★

ముదిలోకం పోయిందని!
పదునైనది యువజీవం
ఎదురైనది సమభావం!!
ఇదిమాత్రం నిజమనవోయ్
మదిలోభం మాసిందని!
ప్రతిజాతికి స్వాతంత్ర్యం
పరపీడా రాహిత్యం!!
ఇదిమాత్రం ఇదిమాత్రం
ఇదిమాత్రం నిజమనవోయ్
వికసించే విధానమున
మకుటధారి మానవుడని!!

దేవులపల్లి కృష్ణశాస్త్రి